# ‘ఫెంగల్’.. వ్యాపారాలు నిల్

- మూడు రోజులుగా వర్షాలు
- చిరు వ్యాపారులకు తుఫాను దెబ్బ




దాబాగార్డెన్స్: ఫెంగల్ తుఫాను ప్రభావంతో ఉత్తరాంధ్రలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. తుఫాను చిరువ్యాపారులపై ప్రభావం చూపించింది. రైతు మార్కెట్‌కు వినియోగదారులు రాకపోవడంతో కూరగాయలు విక్రయాలు జరగలేదు. ఉదయం నుంచి పొద్దుపోయే వరకు అడపదడపా కురిసిన వర్షానికి జనసంచారం లేక రోడ్లన్నీ వెలవెలబోయాయి. ఫుట్‌పాత్ వ్యాపారాలు సాగలేదు. సముద్ర తీర ప్రాంతాలు బోసిపోయాయి. నిత్యం పర్యాటకులు, సందర్శకులతో కళకళలాడే ఆర్కేబీచ్, గోకుల్‌పార్క్ వెలవెలబోయాయి. ఎక్కడా సందర్శకులు, పర్యాటకుల జాడ లేదు. చిన్న చిన్న దుకాణాలు మూతపడ్డాయి.

**చిత్తడి చిత్తడిగా రోడ్లు..**

సోమవారం అడపాదడపా కురిసిన వర్షానికి రహదారులు చిత్తడిగా మారాయి. ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, అల్లిపురం, రెల్లివీధి, రామకృష్ణా జంక్షన్, బౌడరారోడ్డు, 75 ఫీట్‌రోడ్డు, వెలంపేట, దుర్గాలమ్మ గుడి ఏరియా, పూర్ణా మార్కెట్, మెయిన్‌రోడ్డు, పాత నగరం తదితర ప్రాంతాల రోడ్లన్నీ బురదతో నిండాయి.

## వ్యాపారాలు సాగక..

వ్యాపారాలు సాగక మూడు రోజులుగా చిరు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు వ్యాపారం సాగితేనే కుటుంబ పోషణ.. ఒక్కరోజు వ్యాపారం జరగకపోయినా ఇబ్బందులు తప్పవని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఇలా అయితే కష్టమే..



ఎడతెరిపి లేకుండా నాలుగైదు రోజులుగా వర్షం కురుస్తుంటే మా వ్యాపారాలు ఎలా సాగుతాయి. వర్షాలు కురుస్తుంటే కొబ్బరి బొండాలు తాగేవారు ఎవరుంటారు? ఏమాత్రం తెరిపిచ్చినా కాస్తో..కూస్తో..వ్యాపారం జరిగేది. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోపుడుబండ్ల కార్మికులు, ఫుట్‌పాత్ దుకాణదారులు తీవ్రంగా నష్టపోయారు.

-లక్ష్మణ్, కొబ్బరి బొండాల వ్యాపారి

# ఘనంగా పోలి పాడ్యమి



అల్లిపురంలో దీపాలు వదులుతున్న మహిళలు



అల్లిపురం రామాలయం వద్ద కొలనులో దీపాలు వదులుతున్న మహిళలు

అల్లిపురం: కార్తీక మాసం ముగియడంతో మార్గశిర శుద్ధ పాడ్యమి పురస్కరించుకుని సోమవారం తెల్లవారు జామునుంచే మహిళలు ఆలయాలకు చేరుకున్నారు. ఇంట్లో అన్ని రకాల పిండి వంటలు తయారు చేసి, నైవేద్యాలు సమర్పించిన తరువాత పోలికి ఘనంగా వీడ్కోలు పలికేందుకు కొలనులకు తరలివెళ్లారు. ఈ మేరకు నియోజకవర్గంలో ఎక్కడికక్కడ సంఘాలు, ఆలయ కమిటీలు కృత్రిమ కొలనులు ఏర్పాటు చేశారు. అక్కడ మహిళలు గంగమ్మకు పూజలు నిర్వహించి అరటి డొప్పలలో నేతి దీపాలు వెలిగించి పోలికి వీడ్కోలు పలికారు.

**దేవాలయాలు కిటకిట..**

కార్తీక మాసం నెలరోజులు పూజలు నిర్వహించిన మహిళలు పాడ్యమి సందర్భంగా బ్రాహ్మణులకు దానాలు సమర్పించారు. అన్నదానం, వస్త్రదానం, దీపదానం, శాలిగ్రామదానం ఈ విధంగా దానాలు ఇచ్చేందుకు క్యూలు కట్టారు. వేంకటేశ్వరమెట్ట, బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవాస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఆర్కేబీచ్‌లో భక్తులు ఇసుకతో శివ లింగం తయారు చేసి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. అరటి డొప్పలలో దీపాలు వెలిగించి గంగలో వదిలిపెట్టి గంగమ్మకు నమస్కరించుకున్నారు.

# క్లుప్తంగా

## అర్జీలకు సత్వర పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

జగదాంబ: ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని జీవీఎంసీ జోన్‌-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. సోమవారం జోన్‌-4 కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పబ్లిక్ హెల్త్‌కు -ఒకటి, టౌన్‌ప్లానింగ్‌కు- 1 వినతులు అందాయి. అర్జీలు సత్వరం పరిష్కరించాలని జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, రెవెన్యూ అధికారి అప్పలరాజు పాల్గొన్నారు.

**రెండు వినతులు**

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్‌-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ కార్యక్రమంలో రెండు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి ఇన్‌చార్జి జోనల్ కమిషనర్, ఈఈ తారా ప్రసన్నరెడ్డి వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 2 వినతులు అందినట్లు ప్రసన్నరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఎస్.పుణ్యవతి, కృపానందం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యుల చెంతకు సమీనా



సమీనాను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధ సిబ్బంది

సీతమ్మధార: మహారాష్ట్రలోని సంభాజినగర్ నివాసి సమీనా (అలియాస్ సఫియా) 30 ఏళ్లగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. మూడు నెలల క్రితం విశాఖ వచ్చి రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించిన ఏయూటీడీ సిబ్బంది ఆమెను మహిళా షెల్టర్‌కు తరలించారు. ఏయూటీడీ, శ్రద్ధా సిబ్బంది అందించిన సేవలకు త్వరగా కోలుకోవడంతో సమీనాను ఆమె మేనల్లుడు, అన్నయ్యలు జమీర్ ఖాన్, ఇజాజ్ ఖాన్‌లకు అప్పగించారు.

## ఉక్కు పోరాటం ఆగదు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించే వరకు పోరాడతామని సీఐటీయూ జగదాంబ జోన్ అధ్యక్షులు రాజు స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం జీవీఎంసీ గాంధీబొమ్మ వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు సోమవావారానికి 1,340 రోజుకు చేరుకుంది. దీక్షల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నర్సింగరావు, కార్మికులు లక్ష్మీరమ, శ్రీను, సీఐటీయూ నాయకులు నాగమణి, ఆటో యూనియన్ నాయకుడు రమణ పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు



విద్యార్థులతో కళాశాల సిబ్బంది

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రపంచ కంప్యూటర్ సైన్స్ విభాగం కంప్యూటర్ సాక్షరతా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ‘టెక్స్‌ప్లోర్‌-2024’ కార్యక్రమం నిర్వహించారు. హాండ్స్ ఆన్ హచ్, కీస్ట్రోక్ చాంపియన్, లింక్ క్వెస్ట్‌ల్లో పోటీలు నిర్వహించి విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ ఇ. హరిణీ, జి.దీప్తి ఎస్.మాధురి, జె.అనితరాణి, కె.ధార, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట

- సిబ్బందికి అండగా ఉంటాం
- వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సీపీ శంఖబ్రత బాగ్చి



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి



హాజరైన పోలీసులు, వారి కుటుంబ సభ్యులు

మహారాణిపేట: నిరంతరం ప్రజా సేవలో నిమగ్నమయ్యే పోలీసులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. సుమారు 3 వేల మందికి పైగా పోలీస్, హోం గార్డుల కుటుంబ సభ్యులకు కేజీహెచ్‌లో నెల రోజుల పాటు నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు, వారి కటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత తమ కర్తవ్యమని, వారు ఆరోగ్యంగా ఉంటే విధులు నిర్వర్తించడం సులువుగా ఉంటుందని సీపీ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. ఇప్పటికే సిబ్బంది ఫిట్‌నెస్, మానసిక ప్రశాంతత కోసం యోగా శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఊబకాయం తగ్గించుకుంటే విధి నిర్వహణలో మరింత చురుగ్గా పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. ఫిట్‌నెస్‌లో శ్రద్ధ కనబరిచిన సిబ్బందిని సత్కరిస్తున్నామన్నారు. అదే విధంగా సిబ్బంది వారి కుటుంబ సభ్యుల వైద్య పరీక్షలు వివరాలు డిజిటల్ రూపంలో పొందుపరుస్తున్నామన్నారు. మానసిక సమస్యలతో పాటు, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న సిబ్బంది వివరాలు తమకు తెలియజేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి భరోసా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరిండెంటెండ్ డాక్టర్ పి.శివానంద్, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ మోహర్ కుమార్, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, డైట్ చీఫ్ హెచ్ వి.రమణమూర్తి, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన కార్తీక మాసోత్సవాలు



విశేష అలంకరణలో చంద్రమౌళీశ్వరస్వామి

అల్లిపురం: అస్పాంగార్డెన్స్, శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న కార్తీక మాసోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు జి.భార్గవ శర్మ శైవ ఆగమన సంప్రదాయ రీతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమార్చనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారిణి జీవీ రమాబాయి, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, కే మన్మథరెడ్డి, గోపి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ అన్నదానం



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి

జగదాంబ: కార్తీకమాసం పోలి పాడ్యమి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. జీవీఎంసీ 35వ వార్డు కల్లుపాకలల్లో 5వేల మందికి నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కనకరెడ్డి మాట్లాడుతూ పన్నెండుళ్లుగా ఏటా క్రమంత తప్పకుండా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు.

# కాలుష్య నియంత్రణకు సహకరించండి



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: విశాఖలో కాలుష్య నియంత్రణకు సహకరిస్తూ ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా వినియోగించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆమె సోమవారం తమ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు ప్రజలు వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు.

## బౌద్ధ సాహిత్యంలో అనేక రచనలు ప్రాచుర్యం పొందాయి

మహారాణిపేట: సమతా సాహితీ ఆధ్వర్యంలో ‘తెలుగు సాహిత్యంలో బౌద్ధం’ సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతా మహాలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బౌద్ధం సాహిత్యంలో వేల సంవత్సరాల నుంచి అనేక ప్రక్రియల్లో రచనలు వచ్చాయన్నారు. ప్రముఖ రచయిత డాక్టర్ బండి సత్యనారాయణ సభకు అధ్యక్షత వహించారు.ఈ సభలో డాక్టర్ దామెర వెంకట సూర్యారావు, డాక్టర్ మాటూరి శ్రీనివాస్ మాట్లాడారు. డాక్టర్ మోకా ప్రతాప్ స్వాగతం పలికిన ఈ సభలో అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పల రాజు, విశాలాంధ్ర మేనేజర్ రాజు, విశాఖ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కళ్యాణ్ రావు, కార్యదర్శి జె. వి. ప్రభాకర రావు, డాక్టర్ దాస్, ఎస్ హనుమంతరావు, నగర కవులు, రచయితలు, విశాఖ బుద్ధ విహార్‌కు చెందిన పెట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

## 6న కులశేఖర్ సంస్మరణ సభ

మద్దిలపాలెం: నగరానికి చెందిన ప్రముఖ సినీ గేయ రచయిత కులశేఖర్ సంస్మరణ సభ ఈ నెల 6న విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి ఎస్.ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. సింహాచలంలో పుట్టి, బీవీకే డిగ్రీ కళాశాలలో ఆయన చదువుకున్నారన్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పౌర గ్రంథాలయం హాల్‌లో ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మాస్టర్ వై.సత్యారావు, సహ విద్యార్థి, ప్రస్తుత రచయిత(సింహాచలం) లోగిస లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొని నివాళులర్పిస్తారని చెప్పారు.

## బార్‌లు, పబ్‌ల్లో విస్తృత తనిఖీలు

అల్లిపురం: నగర పరిధిలో బార్‌లు, పబ్‌ల్లో ఆదివారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 150 మంది సిబ్బంది 46 బృందాలుగా 56 బార్లు, పబ్‌లపై తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఎక్సైజ్ లైసెన్స్ లేని 4 రెస్టారెంట్లు, ఫుడ్ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్ లేని 3 రెస్టారెంట్లు, పార్కింగ్ స్థలం లేని 12 రెస్టారెంట్లు, ఫైర్ సేఫ్టీ లేని 14 బార్ అండ్ రెస్టారెంట్లు, సీసీ టీవీలేని 2 రెస్టారెంట్లు, గృహ వినియోగ సిలిండర్లు వాడుతున్న 3 రెస్టారెంట్లు, ఎక్కువ ధరకు మద్యం అమ్ముతున్న 12 రెస్టారెంట్లను గుర్తించి.. తదుపరి చర్యలు నిమిత్తం సంబంధిత విభాగాలకు నివేదిక అందించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు.

# నిరుపయోగంగా ఓపెన్ జిమ్‌లు



బాబూకాలనీలో నిర్లక్ష్యంగా వదిలేసిన ఓపెన్ జిమ్ పరికరాలు..

- తుప్పు పడుతున్న పరికరాలు
- పరిసరాలు అధ్వానం



చెత్తాచెదారాలతో నిండిన ఓపెన్ జిమ్ పరిసరాలు

కంచరపాలెం: పేదల ఆరోగ్య భద్రతకు, వ్యాయామానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వార్డుల్లో ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వ వచ్చాక పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో ఓపెన్ జిమ్‌లు మూలకు చేరాయి. జేఎస్‌ఎన్‌ఆర్‌యూ ఎం కాలనీ, స్లీవ్‌గుర్తువీధి, గెడ్డవీధి, మాన్యువల్ స్ట్రీట్ తదితర కాలనీ వాసులు నిత్యం ఇక్కడే వ్యాయం చేసేవారు. ప్రస్తుతం వార్డు ప్రజలు వ్యాయామం చేసేందుకు ఓపెన్ జిమ్ముల వద్దకు వెళ్లేలంటేనే రోత పుట్టించేలా ఉన్నాయి. జిమ్ము పరికరాలు తుప్పు పట్టి, పరిసరాలు చెత్తచెదారాలతో నిండి దుర్గంధభరితంగా మారాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బాబూకాలనీలో ఓపెన్ జిమ్ముకు సరైన రక్షణగోడ లేకపోవడంతో వాహనాలు పార్కింగ్ చేసేందుకు నిత్యం వినియోగిస్తున్నారు. చీకటి పడితే ఆకతాయిల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. బయట నుంచి వచ్చే వ్యక్తులు ధూమపానం, మద్యం సేవిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్ జిమ్‌లో వస్తువులకు సరైన రక్షణ లేదంటు స్థానిక సచివాలయాల్లో ఫిర్యాదులు చేసిన పట్టించుకునే నాథుడు కరువయ్యారని స్థానికులు చెబుతున్నారు.

**జిమ్ పరికరాలకు రక్షణ కల్పించాలి**

ఓపెన్ జిమ్ నిరుపయోగంగా మారింది. పరిసరాలు చెత్తచెదారాలతో నిండి దుర్గంధభరితంగా మారాయి. వ్యాయం చేసేందుకు వీలు లేకుండా ఉంది. జిమ్ పరికరాలకు రక్షణ కల్పించాలి. జిమ్‌ను వినియోగంలోకి తెవాలి.

-పులి గోవిందరావు, సెబాస్టియన్‌కాలనీ, జ్ఞానాపురం

**అధికారులు స్పందించాలి**

ఓపెన్ జిమ్ పరికరాలు నిర్లక్ష్యంగా వదిలేడంతో వ్యాయం చేసేందుకు ఇబ్బంది పడుతున్నాం. వాకింగ్ ట్రాక్ నిర్మిస్తే బాగుంటుంది. ఓపెన్ జిమ్‌కు రక్షణ గోడ నిర్మించాలని గతంలో చెప్పినా పట్టించుకోలేదు. జిమ్ సమస్యలపై సంబంధిత అధికారులు చొరవ చూపాలి.

-ఎస్.రమణరావు, బాబూకాలనీ, జ్ఞానాపురం.

# మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ బాగ్చి

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాలు సందర్భంగా పోలీసు కమిషనర్ ఉత్సవాల ఏర్పాట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. క్యూలైన్ల మధ్య మార్గంలో అత్యవసర గేట్లు ఏర్పాటు చేయాలని, భక్తులకు సూచనలు చేసే విధంగా పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని, ఆలయ పరిసర ప్రాంతాలు సీసీ కెమెరాల ద్వార పరిశీలించి అవసరమైన సూచనలు భక్తులు అందించాలని సూచించారు. అన్ని మార్గాల వద్ద సూచన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మార్గశిర మాసోత్సవాలు పురస్కరించుకొని కనకమహాలక్ష్మి సన్నిధిలో తొలి గురువారం పూజలు బుధవారం అర్ధరాత్రి నుంచి వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా నలుమూలల నుంచి తరలిరానున్న వేలాది మంది భక్తుల దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**దర్శన క్యూలైన్లు ఇలా..**

టౌన్‌కొత్తరోడ్డు నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500 క్యూలైన్ల టికెట్లు అక్కడే ఇస్తారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించనున్నారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం (వీటీ కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ సమీపంలో పోలీస్ అవుట్‌పోస్ట్‌తో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తాగునీటి సదుపాయం ఏర్పాటు చేశారు. టౌన్‌కొత్తరోడ్డు, ఘోషాస్పత్రి, అమ్మవారి ఆలయం వెనుక భాగంలో చెప్పుల స్టాండ్‌ ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు ఏర్పాటు చేశారు.

**ట్రాఫిక్ మళ్లింపు**

- కనకమహాలక్ష్మి మార్గశిర గురువారాలు పురస్కరించుకొని అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న దృష్ట్యా ట్రాఫిక్ మళ్లించనున్నారు.
- జగదాంబ జంక్షన్ మీదుగా అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులు ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు నుంచి టౌన్‌కొత్తరోడ్డు ముందు సందు వద్ద కుడివైపు తిరిగి సూయిజ్‌ఫాం చేరుకుని అక్కడే వాహనాలు పార్కు చేసి కాలి నడకన అమ్మవారి ఆలయానికి వెళ్లాలి.
- కాన్వెంట్ జంక్షన్, అద్వానీ జంక్షన్, రామకృష్ణ జంక్షన్ మీదుగా వచ్చే వాహనాలు సీహార్స్ జంక్షన్ నుంచి టౌన్‌కొత్తరోడ్డు ముందు పార్కింగ్ చేసుకుని కాలినడకన రావాలి.
- వన్‌టౌన్, ఓల్డ్ పోస్టాఫీస్ జంక్షన్ల మీదుగా అమ్మవారి గుడికి వచ్చే ద్విచక్ర వాహనదారులు లక్ష్మీటాకీస్, ఎంవీడీఎం హైస్కూల్ మీదుగా కురుపాం మార్కెట్ మెయిన్‌రోడ్డు కిరువైపులా పార్క్ చేసుకోవాలి.
- వన్‌టౌన్, ఓల్డ్ పోస్టాఫీస్ జంక్షన్లు మీదుగా అమ్మవారి ఆలయానికి వచ్చే నాలుగు చక్రాల వాహనదారులు కురుపాం మార్కెట్‌లో గల ఖాళీ స్థలంలో పార్క్ చేసుకోవాలి.
- వీఐపీ టికెట్ హోల్డర్స్, రూ.500 టికెట్ తీసుకునే వారు బీచ్‌రోడ్డు మీదుగా టౌన్ హాల్ చేరుకుని అక్కడే తమ వాహనాలు పార్క్ చేసుకోవాలి.
- దేవాలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న నివాసముంటున్నవారు తమ వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేసి భక్తులకు అసౌకర్యం కల్గించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి.
- దేవాలయ పరిసర ప్రాంతాల వ్యాపారస్తులు రోడ్లపై ఎటువంటి వస్తువులు, వాహనాలు పెట్టి భక్తులకు అసౌకర్యం కల్గించకుండా సహకరించాలి.

## శిక్షణ ఇప్పించాలి

మహారాణిపేట: ప్రభుత్వ గుర్తింపుతో కూడిన సర్టిఫికేట్ అందజేస్తున్న ఎలక్ట్రానిక్స్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఈఎస్ఎస్‌సీఐ) ద్వారా తమకు శిక్షణ ఇప్పించాలని టీవీ మెకానిక్స్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం సమర్పించినట్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రానిక్స్ అండ్ టీవీ.మెకానిక్స్ ట్రేడ్ యూనియన్ నాయకులు వానపల్లి మాధవరావు తెలిపారు. ఈఎస్ఎస్‌సీఐ ఆధ్వర్యంలో వర్కు ఆర్డర్ ఇచ్చి తమలో 500 మంది సభ్యులకు శిక్షణ ఇచ్చారన్నారు. కొన్ని జిల్లాల్లో శిక్షణ పూర్తయిందని, విశాఖలో ఇంకా పూర్తికాలేదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని కలెక్టర్‌కు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకరిస్తా



ఆలయ అభివృద్ధిపై చర్చిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

దాబాగార్డెన్స్: ఇసుక కొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఆలయ అభివృద్ధిపై చర్చించారు.

## 6 నుంచి గిరిజన యువ సమ్మేళనం



పోస్టర్ విడుదల చేస్తున్న హోం మంత్రి అనిత

మహారాణిపేట: భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాలు, ఇతర శాఖల ఆధ్వర్యంలో 16వ గిరిజన యువ సమ్మేళన కార్యక్రమం ఈనెల 6వ తేదీ నుంచి విశాఖలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత సోమవారం ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో ఆవిష్కరించారు. గిరిజన యువ సమ్మేళనం ఈనెల 12వ తేదీ వరకు గీతం యూనివర్సిటీలో నిర్వహించనున్నారు.